# 118 జీఓను ఎందుకు అమలు చేయడం లేదు?

**ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి**


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**ఎల్‌బీనగర్‌:** ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అని చెప్పుకునే మధుయాష్కీగౌడ్, బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారం కోసం తెచ్చిన118 జీఓను ఎందుకు ఆపారని ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ పరిధిలోని 118 జీఓకు చెందిన వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. 118 జీఓ గురించి కాలనీ వాసులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం వచ్చి దాదాపు 10 నెలలు గడుస్తున్నా ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిమాజాబాద్‌ నుంచి పారిపోయిన వ్యక్తివి నువ్వు.. త్వరలో బండారమంతా బయట పెడుతానని అన్నారు. పోలీసుల బదిలీలో ఎంత తీసుకుని పోస్టింగ్‌లు ఇస్తున్నారో త్వరలోనే బయటకు వస్తాయన్నారు. ప్రజలకు మేలు చేయాలని ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో నామమాత్రపు రుసుంతో ఆగిన ఇళ్ల రిజిస్ట్రేషన్ల సమస్య కోసం తీసుకొచ్చిన జీఓ 118 అని తెలిపారు. ఈ జీఓలోని లోటుపాట్లను సరిదిద్దకుండా రిజిస్ట్రేషన్లను చేయకుండా జీఓను ఆపేయడం సరి కాదన్నారు. గత ప్రభుత్వంలోనే 80 శాతం వరకు రిజిస్ట్రేషన్లు అయ్యాయని రిజిస్ట్రేషన్లు అయినా భవన యజమానుకుల కన్వియన్స్‌డీడ్‌ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదని హెచ్చరించారు. ఈ సమావేశంలో పుల్లారెడ్డి, పోగుల రాంబాబు, పురుషోత్తంరెడ్డి, దామోదర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ముత్యంరావు, రవీంద్‌రెడ్డి, సోమిరెడ్డి, సుధాకర్‌ రెడ్డి, అమరేందర్‌రెడ్డి, ముద్దగాని సతీష్‌గౌడ్‌ ,రాఘవేంద్రశర్మ పాల్గొన్నారు.

**ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని వినతి..**

**నాగోలు:** బండ్లగూడలోని ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కాపాడాలని పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో అధికారులు బండ్లగూడ ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన స్థలంలో ప్రైవేట్‌ వ్యక్తులు భవన నిర్మాణ పనులు చేపట్టాతున్నారని పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# దీపావళి సందడి

- కిటకిటలాడుతున్న మార్కెట్లు
- ఆకట్టుకుంటున్న ప్రమిదలు


వనస్థలిపురంలో అమ్మకానికి ఉంచిన బంతిపూలు


అమ్మకానికి సిద్ధంగా నోముల దొంతులు, లక్ష్మీదేవి విగ్రహాలు

**దిల్‌సుఖ్‌నగర్‌:** మార్కెట్‌లకు దీపావళి శోభ సంతరించుకుంది. ఎటు చూసినా అందమైన ఆకృతుల్లో ప్రమిదలు, లక్ష్మీదేవీ అమ్మవారి విగ్రహాలు, దొంతులు, వివిధ రకాల బొమ్మలు ఆకర్షిస్తున్నాయి. పిల్లలు, పెద్దలు క్రాకర్స్‌ కాల్చేందుకు ఉవ్విల్లూరుతున్నారు. వెలుగు పంచే దీపావళిని ఆనందం, ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. మలక్‌పేట్‌జోన్‌జోన్‌ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్‌, సరూర్‌నగర్‌, మలక్‌పేట్‌, సైదాబాద్‌, ఐఎస్‌సదన్‌, ఆర్‌కేపురం, పరిధిలో దీపావళి టపాసులు అమ్మేందుకు దుఖాణదారులు పోటీపడుతూ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇక వ్యాపారస్తులు తమ దుకాణాలకు రంగులు వేసి లక్ష్మీపూజకు సిద్ధం చేశారు. ప్రమిదల కొనుగోలుదారులతో చౌరస్తాలు సందడిగా మారాయి. దిల్‌సుఖ్‌నగర్‌, మలక్‌పేట్‌, కొత్తపేట్‌, సరూర్‌నగర్‌, చాదర్‌ఘాట్‌ తదితర ప్రాంతాల్లో ధనత్రయోదశి, దీపావళిని పురస్కరించుకొని బంగారం దుకాణాలు క్రయవిక్రయదారులతో కళకళలాడుతున్నాయి. దీపావళికి మిఠాయి దుకాణాలకు భలే గిరాకీ ఉంటుంది. ప్రతి సంస్థ, ఇళ్లు, దుకాణాల్లో మిఠాయిలు పంచుతుంటారు. అందుకోసం ఇప్పటి నుంచే పెద్ద ఎత్తున ఆర్డర్లు ఇస్తున్నారు.


వివిధ రకాల ప్రమిదలు

**పెరిగిన పూలు, పూజ సామగ్రి ధరలు..**

**వనస్థలిపురం:** దీపావళి వేళ పూలు, పూజ సామగ్రి ధరలకు రెక్కలు వచ్చాయి. మామూలు రోజులతో పోలిస్తే ధరలు రెట్టింపు అయ్యాయి. బంతి పూలు మామూలు రోజుల్లో కిలో ధర రూ. 50-60 ఉంటే ప్రస్తుతం రూ.100-120 పలుకుతున్నాయి. అలాగే పూజకు ఉపయోగించే బూడిద, తెల్ల గుమ్మడి కాయలు రూ 60 మొదలుకొని రూ. 120 ధరల్లో విక్రయిస్తున్నారు. దీపావళి సందర్భంగా వెలిగించే మట్టి ప్రమిదలు చిన్నవి డజన్‌ రూ. 40 మొదలుకొని పెద్దవి డజన్‌ రూ. 100 ఉన్నాయి. ధరలు ఎలా ఉన్నా పండుగను పురస్కరించుకుని ఆయా సామగ్రి కొనుగోలుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు.

## డివిజన్‌ అభివృద్ధే లక్ష్యం


పనులను పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి

**మన్సూరాబాద్‌:** డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్‌ నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్‌ పరిధి ఆగమయ్యనగర్‌ కాలనీలో రూ.19 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. డివిజన్‌ అభివృద్ధే లక్ష్యమని రాజకీయాలకు అతీతంగా పనులు చేపడుతున్నామన్నారు. కార్పొరేటర్‌ వెంట ఇంజినీరింగ్‌ వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ సీతారాం, కాలనీవాసులు బాల్‌రాజ్‌గౌడ్‌, జనార్ధన్‌రెడ్డి, కుదిరంబోస్‌, ఆంజనేయులు, ముఖ్రం, శ్రీరాములు, వెంకటచారి, కృష్ణారెడ్డి, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

## వసతుల కల్పనకు వినతి


వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీలవాసులు

**ఎల్‌బీనగర్‌:** బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ పరిధిలోని శివారు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆయా కాలనీవాసులు ప్రభుత్వ సలహాదారు వేంరెడ్డి నరేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బృందావన్‌ మేడోస్‌, శ్రీనివాసపురం కాలనీ, సౌభాగ్య నగర్‌ కాలనీలకు చెందిన పలువురు మాట్లాడుతూ.. తమ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రోడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని వినతిలో కోరగా స్పందించిన వెంరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో శశికాంత్‌, చిత్తరంజన్‌, విద్యారెడ్డి, వేణు, అశోక్‌రెడ్డి ఉన్నారు.

## కులగణన సర్వేకు స్పందన కరువు

**చాదర్‌ఘాట్‌:** వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న కులగణన సర్వేకు ఉపాధ్యాయుల నుంచి స్పందన లేదని మలక్‌పేట సర్కిల్‌-6 డీసీ జయంత్‌ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్కిల్‌-6లో ఉన్న 25 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయలకు సర్వేకు సంబంధించిన నోటీసులు ఇచ్చామని వారి నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు గత రెండ్రోజులుగా శిక్షణ తరగతులు జరుగుతున్నాయని అన్నారు.

# నాగోలు పోలీసులకు సన్మానం


ఇన్‌స్పెక్టర్‌ సూర్యనాయక్‌ను సన్మానిస్తున్న సురక్ష సేవా సంఘం నాయకులు

**నాగోలు:** జైపూరి కాలనీలో నివాసముంటున్న అంధ వృద్ధ దంపతుల కుమారుడు నాలుగు రోజులు క్రితం అస్వస్థతతో మరణించగా మృతదేహం కుళ్లి దుర్వాసన వస్తున్నా తెలుసుకోలేని అంధ దంపతులను చేరదీసిన ఇన్‌స్పెక్టర్‌ సూర్యనాయక్‌, ఎస్‌ఐ శివనాగప్రసాద్‌ను మంగళవారం సురక్ష సేవా సంఘం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపీ శంకర్‌ యాదవ్‌ మాట్లాడుతూ.. ఇంటి పక్కన వ్యక్తి చనిపోతే కనీసం ఇరుగు పొరుగు వారు పట్టించుకోలేని అమానవీయ ఘటన జరగడం బాధాకరమన్నారు. సమాచారం అందుకున్న నాగోల్‌ ఇన్‌స్పెక్టర్‌ సూర్యనాయక్‌, సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ శివనాగ ప్రసాద్‌ మృతి చెందిన ప్రమోద్‌కుమార్‌ మృతదేహాన్ని మార్చురీకి తరలించి వృద్ధ అంధ దంపతులకు ధైర్యం చెప్పి వారికి అన్నం పెట్టి, అవసరాలు తీర్చి మానవత్వం చాటుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సురక్ష సేవా సంఘం సభ్యులు యంజాల ప్రహ్లాద్‌, నాయర్‌ భాయ్‌, అవనిగంటి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

## ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్‌ డే

**మలక్‌పేట:** దిల్‌సుఖ్‌నగర్‌ ప్రగతి డిగ్రీ కాలేజీ కోఎడ్యుకేషన్‌లో మంగళవారం ఫ్రెషర్స్‌, గ్రాడ్యుయేషన్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్‌ ఆర్‌. రాజేశ్వర్‌రెడ్డి ము ఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాలు చేరుకోవడానికి సాధన చేయాలన్నారు. కొత్త విషయాలు తెలుసుకోవడం పట్ల ఆసక్తి చూపాలన్నారు.వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల డైరెక్టర్లు డాక్టర్‌ పి. రాంరెడ్డి, సీతారాంరెడ్డి, ప్రిన్సిపాల్‌ చిన్నారెడ్డి, లెక్చరర్లు పాల్గొన్నారు.

## ఘనంగా ధన్వంతరి జయంతి

**సైదాబాద్‌:** సైదాబాద్‌ డివిజన్‌ రెవిన్యూ బోర్డ్‌ కాలనీలోని నేషనల్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఇండియన్‌ మెడికల్‌ హెరిటేజ్‌ కార్యాలయంలో ధన్వంతరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం తొమ్మిదో ఆయుర్వేద దినోత్సవం పురస్కరించుకొని సంస్థ ప్రాంగణంలో ధన్వంతరి హోమం నిర్వహించారు. డైరెక్టర్‌ జీపీ ప్రసాద్‌ మాట్లాడుతూ..ఆరోగ్యంలో నూతన ఆయుర్వేద ఆవిష్కరణపై తమ సంస్థ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

## మార్కెట్‌ డ్రైనేజీ సమస్యకు తెర

**చాదర్‌ఘాట్‌:** ఎట్టకేలకు మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో డ్రైనేజీ సమస్యకు అధికారులు తెరదించారు. మార్కెట్‌లో గత కొన్ని రోజులుగా డ్రైనేజీలు పొంగి మురుగు మార్కెట్‌లోని రహదారులపై పారుతూ రైతులు, వినియోగదారులు, వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తుంది. మార్కెట్‌ అధికారులు పలుమార్లు స్థానిక జలమండలి అధికారులకు విన్నవించినా స్పందన కరువైంది. దీంతో అధికారులు మార్కెట్‌లోని డ్రైనేజీ సమస్యను జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాలతో మంగళవారం జలమండలి అధికారులు సిబ్బందితో కలిసి మార్కెట్‌కు వచ్చి మరమ్మతు పనులు ప్రారంభించారు.

# క్యూబాపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు

**మన్సూరాబాద్‌:** క్యూబా ప్రజలపై అమెరికా సాగిస్తున్న నియంతృత్వ పోకడలను అరికట్టాలని, అమెరికా విధించిన ఆంక్షలు ఎత్తివేయాలని ఐక్యరాజ్యసమితి తీర్మానం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి డిమాండ్‌ చేశారు. సెంటర్‌ ఆఫ్‌ ఇండియన్‌ ట్రేడ్‌ యూనియన్‌ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం ఆటోనగర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 31 ఏళ్లుగా క్యూబాపై అమెరికా విధించిన ఆర్థిక, వాణిజ్య దిగ్బంధనంతో క్యూబా నష్టపోయిందన్నారు. అమెరికా ఉద్దేశపూర్వకంగానే క్యూబాపై నిషేధాలు, పరిమితులను అమలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య, వీరయ్య, భాస్కర్‌, లక్ష్మణ్‌, సుధీర్‌, సచిన్‌, సురేష్‌, దయానంద్‌ పాల్గొన్నారు.

# పోక్సో కేసులో యువకుడికి ఏడేళ్ల జైలు


పోలేపంగు మమికుమార్‌

**మలక్‌పేట:** మైనర్‌ బాలికపై అత్యాచార కేసులో ఓ యువకుడికి ఏడేళ్ల జైలుశిక్ష పడినట్లు మలక్‌పేట ఇన్‌స్పెక్టర్‌ పిడమర్తి నరేష్‌ తెలిపారు. నాగర్‌కర్నూల్‌ జిల్లా, తెల్కపల్లి మండలం, దొంస్థానపురం గ్రామానికి చెందిన బాలిక(14) మూసారంబాగ్‌ తీగలగూడ రాములు హట్స్‌లో తల్లిదండ్రులతో కలిసి ఉంటూ చదువుకుంటోంది. అదే ప్రాంతంలో ఉంటున్న పోలేపంగు మమికుమార్‌ అలియాస్‌ మణి(23)పెయింటింగ్‌ పనులు చేస్తుంటాడు. 2019 సెప్టెంబర్‌ 13న సదరు బాలిక తోటి స్నేహితులతో కలిసి గణేష్‌ నిమజ్జనం చేసేందుకు వెళ్లి తెల్లవారుజామున 4.30 గంటలకు ఆటోలో రాములు హట్స్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో మణి బాలికను బలవంతంగా తన నివాసానికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు, అదే సమయంలో బాధితురాలి బాబాయ్‌ చూడగా అక్కడి నుంచి పారిపోయాడు. బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్సై ఏడుకొండలు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పూర్తి ఆధారాలు కోర్టుకు అందజేయగా మంగళవారం పోక్సో చట్టం కేసుల ప్రత్యేక సెషన్స్‌ జడ్జి బి. పుష్పలత మణికి ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

## అవార్డు అందజేత



**మన్సూరాబాద్‌:** రైస్‌ ఎటీఎం నిర్వాహకుడు, సామాజిక కార్యకర్త దోసపాటి రాము యంగ్‌ ఇండియన్‌ సేవా పురస్కార్‌-2024 అందుకున్నారు. నగరంలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో సజ్జనర్‌ చేతులమీదుగా అవార్డు అందుకున్నట్లు రాము తెలిపారు. కరోనా సమయం నుంచి నేటి వరకు రైస్‌ ఏటీఎంతో చేస్తున్న సేవలను గుర్తించి అవార్డును అందజేసినట్లు స్పష్టం చేశారు. ఇలాంటి అవార్డులతో బాధ్యత మరింత పెరుగుతుందని మరికొంత మంది సేవ చేయడానికి ముందుకు వస్తారన్నారు.

# త్రిఫ్ట్‌, నూలు సబ్సిడీ పథకాలు పునరుద్ధరించాలి



**మన్సూరాబాద్‌:** చేనేత కార్మికులకు త్రిఫ్ట్‌, నూలు సబ్సిడీ పథకాలను పునరుద్ధరించాలని చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు డిమాండ్‌ చేశారు. మన్సూరాబాద్‌లోని సహారాస్టేట్స్‌కాలనీలో రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్‌ అధ్యక్షతన నిర్వహించిన చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వాయిదాలు వేస్తున్న చేనేత సహకార సంఘాల ఎన్నికలను వెంటనే చేపట్టి సహకార వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. చేనేత కార్మికుల ఉపాధి, సంక్షేమ అభివృద్ధికి బోర్డును ఏర్పాటు చేసి రూ.100కోట్లు కేటాయించాలని కోరారు. ప్రతి చేనేత కార్మికుడికి పెట్టుబడి సాయం కింద రూ.5 లక్షలు అందజేసి, చేనేత కుటుంబాలకు ఆరోగ్యబీమా పథకం అమలు చేయాలన్నారు. కూరపాటి రమేష్‌, గంజి మురళీధర్‌, నరహరి, బడుగు శంకరయ్య, వనం ఉపేందర్‌,కర్నాటి వెంకటేశం, పెంటయ్య, శేఖరయ్య, వెంకటేశ్వర్లు, శ్రీశైలం పాల్గొన్నారు.

## బ్రెయిన్‌స్ట్రోక్‌పై అవగాహన ర్యాలీ

**వనస్థలిపురం:** వరల్డ్‌ బ్రెయిన్‌ స్ట్రోక్‌ డే సందర్భంగా నాసా ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం చింతలకుంటలోని నాసా ఆసుపత్రి నుంచి ఎల్‌బీనగర్‌ చౌరస్తా వరకు సీనియర్‌ సిటిజన్స్‌తో కలిసి వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూరాలజిస్ట్‌ డా. నవీన్‌కుమార్‌ మాట్లాడుతూ.. మెదడుకు వచ్చే పక్షవాతం ఎక్కువవుతోందని, కోవిడ్‌ తర్వాత హార్ట్‌ ఎటాక్‌తో పాటు బ్రెయిన్‌ ఎటాక్‌ కూడా పెరిగిందని అన్నారు. ఇది ఒకప్పుడు 60 ఏళ్ల దాటిన వారికి మాత్రమే వచ్చేదని ప్రస్తుతం 30- 40 ఏళ్ల వారికి కూడా వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.బీపీ, షుగర్‌, కొలెస్ట్రాల్‌, స్మోకింగ్‌, ఆల్కహాల్‌ అలవాటు ఉన్నవారికి, వారసత్వంగా, ఎక్కువ స్ట్రెస్‌ ఉన్నవారికి ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని అన్నారు. దీనిపై ప్రజలకు ఎక్కువగా అవగాహన లేనందున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.స్ట్రోక్‌ వచ్చిన మూడు గంటల్లోపు చికిత్స అందిస్తే ఎలాంటి నష్టం వాటిల్లదని ఆయన పేర్కొన్నారు.

## వికసిత్‌ భారత్‌కు మద్దతు

**మన్సూరాబాద్‌:** కులమతాలకతీతంగా వికసిత్‌ భారత్‌ (అభివృద్ధి చెందిన భారత్‌)కు విశేష మద్దతు పలుకుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు గంగారెడ్డి అన్నారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్‌ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు వర్క్‌షాప్‌కు ఆయన హాజరై మాట్లాడారు. ఎల్‌బీనగర్‌ నియోజకవర్గంలో 60 శాతానికి పైగా సభ్యత్వ నమోదు పూర్తయిందని, ఈ నెల 31 లోపు 100 శాతం పూర్తి చేయాలన్నారు. రవీందర్‌గౌడ్‌, కార్పొరేటర్లు నర్సింహాగుప్తా, నర్సింహాబూరెడ్డి, ప్రేమమహేశ్వర్‌రెడ్డి, నవజీవన్‌రెడ్డి, లచ్చిరెడ్డి, పవన్‌కుమార్‌, నాయకులు రవీందర్‌రెడ్డి, రామేశ్వర్‌, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌, గీతారెడ్డి పాల్గొన్నారు.



## అరుణాచల గిరి ప్రదక్షిణకు బస్సు సర్వీస్‌

**చైతన్యపురి:** కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణకు దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్‌-2 డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీస్‌ నడుపుతున్నట్లు మేనేజర్‌ కృష్ణమూర్తి తెలిపారు. నవంబర్‌ 13న రాత్రి 7.15 దిల్‌సుఖ్‌నగర్‌ నుంచి బయలుదేరి కాణిపాకం, గోల్డెన్‌ టెంపుల్‌ మీదుగా అరుణచలానికి చేరుకుని, 15న మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు హైదరాబాద్‌ చేరుకుంటుందన్నారు. పూర్తి వివరాలకు 9959226249, 7382838010, 9666350995 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## మ్యాన్‌హోల్‌కు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్‌..


మరమ్మతు చేసిన దృశ్యం

**చైతన్యపురి:** గౌతంనగర్‌ కాలనీలో మ్యాన్‌హోల్‌ కుంగి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ సమస్యలపై మంగళవారం 'ప్రమాదకరంగా కుంగిన మ్యాన్‌హోల్‌' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి గడ్డిఅన్నారం కార్పొరేటర్‌ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి స్పందించారు. సంబంధిత సిబ్బందితో ధ్వంసమైన మ్యాన్‌హోల్‌ను తొలగించి నూతనంగా ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన 'సాక్షి'కి స్థానికుడు కీర్తిగారి అనంతాచారి కృతజ్ఞతలు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**చైతన్యపురి:** రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన చైతన్యపురి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కొత్తపేట న్యూమారుతీనగర్‌ కాలనీలో ఉండే సాయి మణిదీప్‌ (24) సోమవారం అర్ధరాత్రి స్నేహితుడు ప్రశాంత్‌తో కలిసి బైక్‌పై చైతన్యపురి వెళ్తున్నాడు. ఎస్‌బీఐ కాలనీ సమీపంలో రాగానే నాగోలు వైపు నుంచి వేగంగా వచ్చిన టిప్పర్‌ ఢీకొట్టడంతో బైక్‌ నడుపుతున్న సాయి మణిదీప్‌ మృతి చెందగా వెనక కూర్చున ప్రశాంత్‌ గాయలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

# వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం

**హస్తినాపురం:** వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హుడాసాయినగర్‌కాలనీకి చెందిన రమ(25) రెండు నెలల క్రితం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం సోదరుడు దామోదర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**అనారోగ్యంతో బాధపడుతూ..**


కసిరెడ్డిప్రతాప్‌రెడ్డి

మానసిక రుగ్మతలతో బాధపడుతున్న ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ద్వారకామాయినగర్‌ కాలనీకి చెందిన కసిరెడ్డి ప్రతాప్‌రెడ్డి(55) ఈ నెల 26న ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం కుమారుడు నికిత్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**ఆర్థిక ఇబ్బందులతో..**


ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్‌ మధురానగర్‌కాలనీకి చెందిన లెంకల ప్రభాకర్‌రెడ్డి(43) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా వేదనకు గురై తరుచూ ఇంట్లో చెప్పకుండా బయటకి వెళ్లి ఎప్పుడంటే అప్పుడు వచ్చేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గత రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ప్రభాకర్‌రెడ్డి ఎంతకీ రాకపోవడంతో స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## దారి దోపిడీ: యువకుడిపై కేసు

**చంచల్‌గూడ:** కారు డ్రైవర్‌పై దాడిచేసి డబ్బులు దోచుకున్న ఓ యువకుడిపై కేసు నమోదైన ఘటన మాదన్నపేట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మాదన్నపేట భానునగర్‌లో నివాసముండే మహ్మద్‌ సోహేల్‌(24) ఓలా క్యాబ్‌ నడుపుతుంటాడు. మంగళవారం చంచల్‌గూడ జైలు వద్ద కారు ఆపగా, అఖిల్‌ మాజిద్‌ అనే యువకుడు వచ్చి డబ్బులు అడిగాడు. అందుకు సోహేల్‌ నిరాకరించాడంతో కారు తాళాలు లాక్కొని బలవంతంగా రూ. 2 వేలు దోచుకున్నాడు. అంతటితో ఆగకుండా కారునూ ధ్వంసం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.